సాక్షి చిత్తూరు

బుధవారం ၊ 15 ၊ అక్టోబర్ ၊ 2025

I



సర్కారు వేధింపులు సరికాదు!
పీహెచ్‌సీ వైద్యుల న్యాయమైన డిమాండ్లు నెర వేర్చకుండా వేధింపులకు పాల్పడడం సరికాదని శ్రీనివాసమూర్తి అన్నారు. - IIలో



పరిశ్రమల స్థాపనకు చర్యలు
ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు జిల్లాలో పరి శ్రమల స్థాపనకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. - IIలో



ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం
వైద్యవిద్యను ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతి రేకిస్తూ ప్రజా ఉద్యమాలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. - IIలో

న్యూస్‌రీల్

19న చెస్ పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : ఆల్ చిత్తూరు చెస్ డెవలప్ మెంట్ అసోసియేషన్ సహకారంతో ది స్కూల్ ఆఫ్ చెస్ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన చిత్తూరుటౌన్‌లో చెస్ చాంపియన్ చెస్ పోటీలు నిర్వహించనున్నారు. మంగళవారం జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ బాబుప్రసాద్‌రెడ్డి, ఆంధ్రా చెస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.ఆర్.బి ప్రసాద్ చెస్ పోటీల వివరాలను వెల్లడించారు. చిత్తూరు నగరంలోని విద్యార్థులు మాత్రమే చెస్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత ఉంటుందన్నారు. అండర్ 7,9,12,16 విద్యార్థులు చెస్ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న విద్యార్థులు 9000475799 నంబర్‌లో సంప్రదించి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వారు కోరారు.

కర్నూలుకు 250 ఆర్టీసీ బస్సులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కర్నూలులో జరిగే పీఎం సభకు జిల్లా నుంచి 250 బస్సులు కేటాయించారు. చిత్తూరు వన్‌డిపో నుంచి 42, టూడిపో నుంచి 53, కుప్పం నుంచి 70, పలమనేరు నుంచి 37, పుంగనూరు నుంచి 47 బస్సులు పంపాలని నిర్ణయించారు. ఇవీ బుధవారం జిల్లా నుంచి కర్నూలుకు బయలుదేరనున్నాయి. గురువారం జరిగే సభ ముగిసిన తరువాత శుక్రవారం తిరిగిరానున్నాయి. దీంతో మూడు రోజులపాటు జిల్లాలోని ప్రయాణికులకు అవస్థలు పడాల్సి ఉంది.

18న ప్రదోషపూజ

కాణిపాకం: శని త్రయోదశిని పురస్కరించుకుని ఈనెల 18వ తేదీన కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన అనుబంధ ఆలయమైనా మణికంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రదోష పూజ జరగనున్నట్లు ఈఓ పెంచలకిషోర్ తెలిపారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ప్రదోషపూజ జరుగుతుందని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్ : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 15 వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్థానిక గాంధీరోడ్డులోని అర్బన్ డివిజన్ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల విద్యుత్ వినియోగదారులు సమస్యలను వినతుల రూపంలో తెలియజేయాలని ఆయన కోరారు.

ఐజర్‌కు ఎస్‌బీఐ భారీ విరాళం

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఐజర్)కు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రూ.23.60లక్షల విరాళం అందించింది. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కింద ఐజర్‌లో మౌలిక వసతుల కల్పన ఈ మొత్తం అందజేసింది. ఇందులో అత్యవసర వైద్య సేవల నిమిత్తం రూ.15.38లక్షల విలువైన అంబులెన్స్, క్యాంటీన్ సేవల మెరుగుపరిచేందుకు రూ.8.22లక్షల విలువైన ఆటోమెటిక్ కియోస్క్ వ్యవస్థను వితరణ చేసింది. మంగళవారం ఈ మేరకు ఎస్‌బీఐ ఉన్నతాధికారులు రాజేష్‌కుమార్ పటేల్, అమరేంద్రకుమార్ సుమన్, దినేష్ గులాటీ చేతుల మీదుగా ఐజర్ ప్రతినిధులకు అందజేశారు.

గుజ్జు లాగేశారు!

ఏడాది పాటు చెమటోడ్చి కష్టించే మామిడి రైతులంటే అందరికీ అలుసుగా మారింది. తోతాపురి మామిడి రైతులను ఈ ఏడాది ఎన్నడూ లేనన్ని కష్టాలు చుట్టుముట్టాయి. పంట విక్రయం ద్వారా వచ్చే సొమ్ముతో కుటుంబ అవసరాలు, చేసిన అప్పులు తీర్చుకుందామనుకున్న కర్షకుల ఆశలు అడియాశలయ్యాయి. తోతాపురి విక్రయంలో అన్ని దశల్లోనూ పుడమి పుత్రులు దగా పడ్డారు.

- మామిడి విక్రయాల్లో మాయాజాలం
- ర్యాంపుల్లో గోల్‌మాల్
- బినామీ పేర్లతో కాయలు తోలినట్లు లెక్కలు
- పరిశీలనలో తేలని అక్రమాలు
- ఫ్యాక్టరీ ఇవ్వాల్సిన రూ.8పై నిలదీస్తున్న రైతు నాయకులు



మామిడి కాయలతో క్యూకట్టిన ట్రాక్టర్లు (ఫైల్)



కాణిపాకం: మామిడి కాయల విక్రయంలో బినామీ లెక్కలకు రెక్కలొచ్చాయి. అక్రమాలు పరిశీలన పక్కదారి పట్టింది. అసలు లెక్కలను అధికారులు తోసిపుచ్చారు. బోగస్ లెక్కలను తేల్చలేకపోయారు. తద్వారా ప్రభుత్వం అందించిన మామిడి ప్రోత్సాహక నిధి రూ.4 చెల్లింపు దుర్వినియోగమైందని రైతు సంఘాల నేతలు మండిపడుతున్నారు. రాయితీ పోయినా ఫ్యాక్టరీ చెల్లించాల్సిన రూ.8 కోసం రోడ్డెక్కారు. రైతు సంఘం నేతల గొంతు నొక్కేందుకు కొందరు ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో తోతాపురి మామిడి అవకతవలను నివారణకు జిల్లా యంత్రాంగం ముందుకు వచ్చి కాయలు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం తోతాపురి కిలో రూ.12 గిట్టుబాటు ధరను ప్రకటించింది. ఫ్యాక్టరీలు కిలో రూ.8 చెల్లించేలా, ప్రభుత్వం ప్రోత్సాహక నిధి కింద రూ.4 చెల్లిస్తామని వెల్లడించింది. అయితే కాయల విక్రయానికి టోకెన్ల పద్ధతి ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో రాయితీపై కన్నేసిన కొందరు అక్రమాలకు తెగబడ్డారు.

మధ్యవర్తుల దందా..

మామిడి కొనుగోలు సమయంలో ఫ్యాక్టరీల వద్ద కొందరు కాపు కాచారు. కూటమి నేతలు, ప్రజాప్రతినిధుల పేరు చెప్పి టోకన్లను అమ్ముకున్నారనే ఆరోపణలు బలంగా వినిపించాయి. ఆ తర్వాత తమిళనాడు రాష్ట్రంలో పండిన కాయలను జిల్లాలోని ఫ్యాక్టరీలకు తరలించారనే వాదనలు వినిపించాయి. ఈ దోపిడీ జోరుగా సాగుతోందని సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తమై తమిళనాడు సరిహద్దులో నిఘా పెట్టారు. దీనికి తోడు వ్యాపారులను బుట్టలో వేసుకుని కూటమికి చెందిన కొందరు ప్రభుత్వ ప్రోత్సాహక నిధి దోపిడీకి తెరలేపారు. ర్యాంపులను అడ్డం పెట్టుకుని కాయలు కాటా వేసి, బోగస్ పేర్లు, బిల్లులు సృష్టించారు. ఇలాంటివి బంగారుపాళెం, కుప్పం, వి.కోట, పలమనేరు, సోమల తదితర ప్రాంతాల్లో జరిగినట్లు విమర్శలు వచ్చాయి. అలాగే నీలం కాయలను కూడా ర్యాంపులకు తరలించి తోతాపురి లెక్కల్లోకి ఎక్కించారని ఆరోపణలు భగ్గుమన్నాయి. దీనిపై సొంత పార్టీ ఎమ్మెల్యేలే ప్రపంచ మామిడి దినోత్సవ సభలో భగ్గుమన్నారు. బోగస్ లెక్కలను బయటకు తీస్తామని సభ సాక్షిగా హామీ ఇచ్చారు. అయితే అధికారులు పరిశీలన పేరుతో జాప్యం చేసి తమ చేతులు దులుపుకున్నట్లు తెలిసింది. ర్యాంపుల వద్ద లెక్కలు గందరగోళంగా ఉండడంతో ఏం చేయలేక మిన్నకుండిపోయినట్లు సమాచారం.

నిధి మంజూరుతో ఇలా..

అధికారులు పరిశీలన పూర్తి చేసి ఇచ్చిన నివేదికలపై రైతులకు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 31,929 మంది రైతులు 79,963 సార్లు కాయలు తరలించగా 3.67లక్ష టన్నుల కాయలు విక్రయించినట్లు లెక్కకట్టారు. ఇందుకు గాను ప్రభుత్వం రూ.146 కోట్ల మేర నిధులు మంజూరు చేసిందని అధికారులు వెల్లడించారు. అయితే ఈ చెల్లింపులపై రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బోగస్ లెక్కలు తేలకుండా నిధులు జమ చేయడంపై మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

రూ.8 మాటేంటీ..

ప్రభుత్వం తోతాపురికి ప్రకటించిన మద్దతు ధర విషయంలో మీనమేషాలు లెక్కిస్తోంది. రూ.4 ప్రోత్సాహక నిధి చెల్లించి..చేతులు దులుపుకుంటోంది. అయితే ఫ్యాక్టరీ నుంచి కిలో రూ.8 ఇవ్వాల్సి ఉండగా..దీనిపై నోరువిప్పడం లేదు. ఇది వరకే కొన్ని ఫ్యాక్టరీలు కిలో రూ.5 చెల్లించగా రైతులు భగుమంటున్నారు. ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు వ్యతిరేకంగా రైతు సంఘ నాయకులు అక్రందన సభ నిర్వాహణకు సిద్ధపడ్డారు. బుధవారం బంగారుపాళెం మండలంలోని మార్కెట్‌యార్డులో సభ నిర్వహణకు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు కూటమికి చెందిన నేతలు, ప్రజాప్రతినిధుల నుంచి రైతుల సంఘం నాయకులకు బెదిరింపులు వస్తున్నాయి. సభను అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దతు ధరపై పోరాడుతున్న రైతు నాయకులను అడ్డుకుంటే భవిష్యత్ ఉండదని వారు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

ఇలా అమ్మకాలు...

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది తోతాపురి రకం 39,895 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు కాగా 4.99 లక్షల టన్నుల కాయలు దిగుబడి వచ్చినట్లు అధికారుల అంచనా వేశారు. మొత్తం 43 ఫ్యాక్టరీలుండగా 31 ఫ్యాక్టరీలు కాయల కొనుగోలు చేశాయి. ఈ ఫ్యాక్టరీ లు 49,350 మంది రైతుల నుంచి 2.31 లక్షల మెట్రిక్ టన్నుల కాయలను కొనుగోలు చేయగా.. 25 ర్యాంపులు 30,600 మంది రైతుల నుంచి 1.44 లక్షల మెట్రిక్ టన్నుల కాయలను కొనుగోలు చేసినట్లు అధికారులు అప్పట్లో నివేదికలిచ్చారు.

బోగస్ లెక్కలు తేల్చాలి



కొన్ని ర్యాంపుల్లో ప్రభుత్వ నిధిని దోచుకోవాలని బోగస్ లెక్కలు చూపించారు. ఆ లెక్కలు తేలకుండా నిధి జమ చేశారు. దీంతో ప్రజానిధి పక్కదారి పట్టిందని భావిస్తున్నాం. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపించాలి. ఆ బోగస్ లెక్కలు తేల్చాలి. అలాగే ఫ్యాక్టరీలు కిలోకు రూ.8 ఇవ్వాలి. ఇందుకు అన్ని పార్టీలను సమన్వయం చేసుకుని సభకు పూనుకున్నాం. –ఉమాపతినాయుడు, మామిడి రైతు సంఘ ఉపాధ్యక్షులు

ఫ్యాక్టరీల నుంచి రూ. 8 ఇప్పించాలి



ప్రభుత్వం తోతాపురికి మద్దతు ధరగా కిలో రూ.12 ప్రకటించింది. ఆ ప్రకారమే రైతులకు నగదు ఇప్పించాలి. ఫ్యాక్టరీలు కేజీకి రూ. 5 ఇస్తే ఒప్పుకోం. కచ్చితంగా రూ.8 ఇవ్వాల్సిందే. ఇవ్వని ఫ్యాక్టరీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఈనేపథ్యంలోనే బంగారుపాళ్యంలో అక్రందన సభను నిర్వహిస్తున్నాం. ఈ సభను అడ్డుకోవద్దు. మేము రైతుల కోసం పోరాడుతున్నాం. ఇందుకు అందరు సహకరించాలి. – జనార్దన్, మామిడి రైతు సంఘ అధ్యక్షులు

ఇంకా చేయాల్సింది ఉంది



మామిడి కొనుగోలుపై పరిశీలన చేపట్టాం. పరిశీలనలో చాలా వరకు తీసేశాం. ఇంకా పరిశీలన చేయాల్సి ఉంది. చేస్తాం. ఏదైనా అనుమానం ఉంటే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. కచ్చితంగా స్పందిస్తాం. చర్యలు తీసుకుంటాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అనుమానాలు వద్దు. – మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, చిత్తూరు

వైఎస్సార్ సీపీ, మాజీ సీఎం జగన్ చల్లగుండాలని..



స్వామివారి సన్నిధిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



స్వామివారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నాయకులు

- రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- వరసిద్ధి వినాయకస్వామికి ప్రత్యేక పూజలు

కాణిపాకం: వైఎస్సార్ సీపీతోపాటు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చల్లగుండాలని ఆ వరసిద్ధి వినాయకస్వామివారిని వేడుకున్నట్లు రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని మంగళవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి దంపతులు దర్శించుకున్నారు. వీరికి మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్, చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయాధికారులు ఆయనకు దగ్గరుండి స్వామివారి దర్శనం కల్పించారు. వేద ఆశీర్వచన మండపంలో పండితులు శేషవస్త్రం అందజేసి, ఆశీర్వచనం పలికారు. తర్వాత ఆలయాధికారులు స్వామి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. పార్టీతోపాటు, జగన్‌కు ఎల్లప్పుడు వరసిద్ధివినాయకస్వామివారి ఆశీర్వాదం ఉండాలని ప్రార్థించినట్లు పెద్దిరెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, సీనియర్ నాయకులు తలపులపల్లి బాబురెడ్డి, మాజీ ఎమ్మెల్యే లలితా కుమారి, మండల కన్వీనర్లు శ్రీకాంత్‌రెడ్డి, పాలేరు రామచంద్రారెడ్డి, హరిరెడ్డి, బుజ్జిరెడ్డి, నాయకులు శిరీష్‌రెడ్డి, బాబురెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మనోహర్, ప్రవీణ్‌రెడ్డి, పాలాక్షిరెడ్డి, చిన్నారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, నాగరాజు, సైలేష్, కుమారరాజా, గోవిందస్వామి, కోదండ, అన్నామలై తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు

– 23 నుంచి 30వ తేదీ వరకు నిర్వహణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక ఆధార్ క్యాంపుల నిర్వహణకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు. 2026వ సంవత్సరం సెప్టెంబర్ 30వ తేదీలోపు కచ్చితంగా మ్యాండిటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ (ఎంబీయూ) చేయించుకోవాలని ఆధార్ సంస్థ యూఐడీఏఐ ఆదేశించింది. ఈ మేరకు ఎంబీయూ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 23 నుంచి 30వ తేదీ వరకు గుర్తించిన పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 5 నుంచి 15 ఏళ్ల లోపు వయస్సు ఉన్న 32,011 మంది, 15 సంవత్సరాలు పైబడిన 16,937 మంది మొత్తం 48,948 మంది విద్యార్థులు మ్యాండిటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాలని అధికారులు వెల్లడిస్తున్నారు. వీరందరికీ ఆధార్ అప్‌డేట్ చేసేలా ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు.

అధికారిక సమావేశంలో టీడీపీ నేత



కలెక్టర్ చాంబర్‌లో జరిగిన అధికారిక సమావేశంలో టీడీపీ నేత జయప్రకాష్‌నాయుడు (రౌండప్ చేసిన వ్యక్తి)

సాక్షి, టాస్క్‌ఫోర్స్: అదేదో మారుమూల ప్రాంతం కాదు..సాక్షాత్తు జిల్లా ఉన్నతాధికారి ఉండే కలెక్టరేట్ కార్యాలయం. ఆ కార్యాలయంలోని కలెక్టరేట్ చాంబర్‌లో టూరిజం అధికారులతో నిర్వహిస్తున్న సమావేశంలో టీడీపీ నాయకుడు జయప్రకాష్‌నాయుడు తిష్టవేశారు. అధికారిక సమావేశం నిర్వహిస్తున్న సమయంలో ఎలాంటి హోదా లేని ఆయన తిష్ట వేయడంపై పలు విమర్శలు తలెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధి హోదా లేని ఆయన కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో పాల్గొనడం ఏమిటని సమావేశంలో పాల్గొన్న అధికారులే పెదవి విరుస్తున్నారు. ప్రజాప్రతినిధి హోదా లేని నాయకులను ప్రోత్సహిస్తున్న జిల్లా యంత్రాంగంపై పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపడితే విలువ కోల్పోకుండా ఉంటారని పలువురు పెదవి విరుస్తున్నారు.

న్యాయం గెలిచింది

సోషల్ మీడియా కార్యకర్తల అరెస్ట్‌లో ఎట్టకేలకు న్యాయమే గెలిచింది. కూటమి ప్రభుత్వానికి కోర్టు తీర్పు చెంపపెట్టులా మారింది. పోలీసులను అడ్డుపెట్టుకుని సాగిస్తున్న కక్ష సాధింపు చర్యలను యావత్ ప్రజానీకం తప్పుపడుతోంది. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయడం ప్రజాస్వామ్యంలో సరికాదని సూచిస్తోంది. సంక్షేమం విస్మరించి వేధింపులకు దిగడం పద్ధతి కాదని స్పష్టం చేస్తోంది. సర్కారు విధానాలను ప్రశ్నించే అధికారం ప్రతి ఒక్క పౌరుడికీ ఉంటుందని వెల్లడిస్తోంది.

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టును తిరుపతి మూడో అదనపు జూనియర్ జడ్జి తిరస్కరించారు. 41 నోటీసులు సరిపోతాయని వెల్లడించారు. న్యాయస్థానం తీర్పుపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ వైఖరిపై తిరుపతి వాసులు మండిపడుతున్నారు. అధికారాన్ని ఉపయోగించి సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమంగా అరెస్టు చేయడం పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 41 నోటీసులు ఇచ్చి విడిచి పెట్టాల్సిన కేసులో సోషల్ మీడియా కార్యకర్తలు నవీన్, చంద్రశేఖర వెంకటేష్‌ని టెర్రరిస్ట్‌లను అరెస్ట్ చేసినట్టు ముసుగులేసి, రోడ్లపై నడిపిస్తూ కోర్టులో హాజరుపరచంపై విమర్శలు ఎక్కుపెడుతున్నారు. వారిద్దరి రిమాండ్‌ను న్యాయస్థానం మంగళవారం రాత్రి తిరస్కరించింది.



నవీన్, చంద్రశేఖర్‌ను కోర్టుకు తరలిస్తున్న పోలీసులు



మీడియాతో మాట్లాడుతున్న ఏఎస్పీ రవిమనోహరాచారి

అసలేం జరిగిందంటే!

తిరుపతిలో మద్యం ఏరులై పారుతోంది. మద్యం సేవించిన కొందరు రోడ్డుపై పడి ఉండడం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఆ వీడియోలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన నవీన్, చంద్రశేఖర్ వెంకటేష్ వైరల్ చేశారని కూటమి నేతలు ఎక్సైజ్ అధికారులపై ఒత్తిడి చేశారు. కూటమి నేతల ఒత్తిడితో సోమవారం వారిద్దరిపై ఈస్ట్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం రాత్రి రిమాండ్‌కు తరలించారు. రిమాండ్ను సవాల్ చేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ న్యాయ స్థానాన్ని ఆశ్రయించింది. దీంతో రిమాండ్‌ను తిరస్కరిస్తూ మూడో అదనపు జూనియర్ జడ్జి తీర్పు ఇచ్చారు.

అణగదొక్కడం సరికాదు

ప్రభుత్వ విధానాలు సక్రమంగా లేకుంటే ప్రతిపక్ష పార్టీ ఎండగడితేనే ప్రజలకు మేలు జరుగుతుందని పలువురు స్పష్టం చేస్తున్నారు. విమర్శలను పాలకులు సానుకూలంగా తీసుకోవాలని సూచిస్తున్నారు. అలా కాకుండా తప్పులను ఎత్తి చూపిన వారిని కేసులతో వేధించడం, ప్రశ్నించే గొంతుకలను అణగదొక్కేందుకు యత్నించడం సరికాదని వెల్లడిస్తున్నారు. బెల్ట్ షాపులను అరికట్టడం వదలేసి ప్రశ్నించిన వారిని అరెస్ట్ చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యక్తిగత పూచీ కత్తుపై విడుదల

తిరుపతి లీగల్: తిరుపతి వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా నాయకుడు బ్యంగి నవీన్ అలియాస్ నాని, తిరుపతి, ఎంఆర్ పల్లి, శాంతినగర్కు చెందిన సి.వెంకటేష్ పై ఈస్ట్ పోలీసులు నమోదు చేసిన కేసులో వ్యక్తిగత పూచీ కత్తుపై ఇద్దరినీ విడుదల చేస్తూ తిరుపతి మూడవ అదనపు జూనియర్ జడ్జి సంధ్యారాణి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు యుగంధర్ రెడ్డి, కొత్తపల్లి విజయ్కుమార్, ఐ.చంద్రశేఖర్ రెడ్డిలు వాదనలు వినిపించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం, ఇటీవల రాష్ట్ర హైకోర్టు ఉత్తర్వు ప్రకారం ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో 41 ఏ నోటీసు ఇవ్వాలని తీర్పు ఉండగా పోలీసులు రిమాండ్‌కు తీసుకురావడం చట్టవిరుద్ధమన్నారు. వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యార్థులను ఎఫీఫనీ పరీక్షకు సిద్ధం చేయండి

- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్
- కమిషనర్ ఉత్తర్వులు అమలు చేయని జిల్లా విద్యాశాఖాధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 7, 10 తరగతుల విద్యార్థులను ఎఫీఫనీ (ఈఈఎంటీ) మెరిట్ పరీక్షకు సన్నద్ధం చేయాలని రాష్ట్ర విద్యాశాఖాధికారులు ఆదేశించారు. ఈ పరీక్షకు సంబంధించి పాటించాల్సిన నియమ, నిబంధనల ఉత్తర్వులను రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు జారీ చేశారు. కాగా జిల్లా విద్యాశాఖ అధికారులు ఉత్తర్వుల అమలుపై ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ నెల 8వ తేదీన కమిషనర్ ఉత్తర్వులు జారీ చేస్తే ఇప్పటివరకు జిల్లా విద్యాశాఖాధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించకపోవడం కమిషనర్ ఉత్తర్వులకు విలువ ఇవ్వకపోవడమేనని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎడ్యుకేషనల్ ఎఫీపనీ అనే సంస్థ మెరిటీటెస్‌ను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతి ఏటా నిర్వహిస్తోంది. ప్రిలిమ్స్, మెయిన్ అనే రెండు దశల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. విద్యార్థుల ఇష్టం ప్రకారం ఇంటి నుంచి లేదా పాఠశాల నుంచి హాజరయ్యే అవకాశం కల్పిస్తారు. ఈ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో పదోతరగతిలో ప్రథమ బహుమతి సాధిస్తే రూ.30 వేలు, ద్వితీయ బహుమతికి రూ.25 వేలు, తృతీయ బహుమతికి రూ.20 వేలు, అలాగే ఏడో తరగతిలో ప్రథమ బహుమతికి రూ.20 వేలు, ద్వితీయ రూ.15 వేలు, తృతీయ రూ.10 వేలు చొప్పున 162 మందిని ఎంపిక చేసి రూ.9 లక్షల విలువైన నగదు బహుమతులను అందజేయనున్నారు. ఈ నెల 15వ తేదీ నుంచి నవంబర్ 14వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పరీక్షలపై జిల్లా విద్యాశాఖ అధికారులు అవగాహన కల్పించకపోవడంపై విమర్శలు వెలువెత్తుతున్నాయి.

కుప్పం రెస్కో పీఐసీకి ఇద్దరు సభ్యులు

–మనోహర్, చంద్రశేఖర్ నియామకం

సాక్షి, అమరావతి: కుప్పం రూరల్ ఎలక్ట్రిక్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్(రెస్కో) నాన్ అనధికారిక పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ(పీఐసీ)కి బీ.మనోహర్, ఎంజే చంద్రశేఖర్‌ను అదనపు సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వీరు బాధ్యతలు స్వీకరించిన తేదీ నుంచి ఆరు నెలల పాటుగానీ, ఎన్నికలు నిర్వహించే వరకు, ఏది ముందు అయితే అప్పటి వరకు ఈ పదవిలో కొనసాగుతారని తెలిపింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్లుప్తంగా

రేషన్ బియ్యం పట్టివేత

నింద్ర: మండలంలోని అత్తూరు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉన్న 34 బస్తాల రేషన్ 1,685 కిలోల బియ్యం పట్టినట్లు నింద్ర ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. అత్తూరు గ్రామంలో సచివాలయం పక్కన నిర్మాణంలో ఉన్న వెలుగు భవనంలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ చేసినట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు దాడులు చేశారు. ఆ సమయంలో అక్కడ ఉన్న 34 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నగరి మండలానికి చెందిన వ్యక్తి తరచూ గ్రామంలో బియ్యం కొనుగోలు చేసి ఇక్కడ నిల్వ చేసి, ఇతర ప్రాంతాలకు తరలించి, విక్రయిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ దాడుల్లో ఆర్ఐ నరశింహులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం స్వాధీనం

నదుం: మండలంలోని డెయిరీ వద్ద తిరుపతి జిల్లా భాకరాపేట అటవీశాఖ అధికారులు మంగళవారం ఉదయం వాహనం సహా ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానికుల కథనం మేరకు.. అక్రమ రవాణాపై అధికారులకు అందిన సమాచారం మేరకు వాహనాన్ని వెంబడించారు. దుండగులు ఎర్రచందనం తరలిస్తున్న కారును దుంగలతోపాటు డెయిరీ వద్ద వదిలి పారిపోయారు. పూర్తి వివరాలు అధికారులు తెలపాల్సి ఉంది.

సిగరెట్ ప్యాకెట్ల చోరీ

చిత్తూరు అర్బన్: గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ ప్యాకెట్లు చోరీ చేసిన ఘటన మంగళవారం చిత్తూరు నగరంలో చోటుచేసుకుంది. నగరంలోని సామిరెడ్డివీధిలో ఉన్న రాజేశ్వరి జనరల్ స్టోర్ తాళాలను గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి లోపలికి వెళ్లి రూ.2లక్షలు విలువ చేసే సిగరెట్‌ను అపహరించారు. దీనిపై స్టోర్ నిర్వాహకులు సుమంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు సీసీ కెమెరాను పరిశీలించగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు కారులో వచ్చి ఈ చోరీ పాల్పడినట్లు తెలిసింది.

సీఐటీయూ జిల్లా నూతన కార్యవర్గం


ఎస్.జయచంద్ర


టి.సుబ్రమణ్యం

పుత్తూరు: పట్టణంలో మంగళవారం జరిగిన జిల్లా మహాసభలో సీఐటీయూ తిరుపతి జిల్లా నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవమైంది. రెండు రోజులపాటు జరిగిన సభల్లో కార్మిక హక్కులు, ఉద్యోగభద్రత, కనీస వేతనం సాధించుకొనేందుకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని కార్మిక సంఘాలకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు పిలుపునిచ్చారు. అనంతరం ప్రవేశపెట్టిన 28 తీర్మానాలను సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సందర్భంగా సీఐటీయూ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా ఎస్.జయచంద్ర, ప్రధాన కార్యదర్శిగా టి.సుబ్రమణ్యంతోపాటు మొత్తం 56 మంది సభ్యులు ఎన్నికయ్యారు.

17 నుంచి పవిత్రోత్సవాలు

– అంకురార్పణ రేపు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో 17వ తేదీ నుంచి మూడు రోజుల పాటు పవిత్రోత్సవాలను నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలిరోజు సాయంత్రం 6.30 గంటలకు పవిత్ర ప్రతిష్ఠ, గురువారం మధ్యాహ్నం 12 గంటలకు పవిత్ర సమర్పణ, సాయంత్రం అంకురార్పణ నిర్వహిస్తారు. శుక్రవారం రాత్రి 7 గంటలకు పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు పరిసమాప్తమవుతాయి. పవిత్రోత్సవాల సందర్భంగా గురువారం తిరుప్పావడ సేవ, అక్టోబర్ 17 నుంచి 19 వరకు నిత్య కళ్యాణోత్సవం సేవలను రద్దు చేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పరిహారం.. ఫలహారం!

కష్టాల సుడి నుంచి కర్షకుడిని గట్టెక్కించడానికి సర్కారు మంజూరు చేసిన సాయంలోనూ కొందరు చేతివాటం ప్రదర్శించారు. తమ తోటలను లీజు కిచ్చిన ఫలితం దక్కించుకున్న రైతులు సైతం దొంగ బిల్లులతో పరిహారం పొందారు. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు గండి పడగా.. నిజమైన లబ్ధిదారుడికి అన్యాయం జరిగింది.

- తోటలను అమ్ముకుని మళ్లీ నష్ట పరిహారం పొందిన రైతులు
- మామిడితోట ఉంటే చాలు జిమ్మిక్కులతో పరిహారం
- హార్టికల్చర్ సిబ్బంది ప్రమేయంతో పక్కాగా మోసాలు
- ట్రాక్టర్ల నంబర్ ప్లేట్లు మార్చి మరీ బిల్లులు
- దీంతో రూ.46 కోట్ల ప్రజాధనం హుష్ కాకీ


పలమనేరులోని ర్యాంపు వద్ద ఓ దొంగ బిల్లుల వాహనం(ఫైల్)

పలమనేరు: తోతాపురి రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వం కిలోకి రూ.4 రాయితీ ఇస్తామని చెప్పడంతో మామిడి రైతులు ప్రభుత్వాన్ని ఎలా ఏమార్చాలో తెలుసుకుని మరీ మోసం చేశారు. వీరికి సంబంధిత హార్టికల్చర్ అధికారులు, సిబ్బంది బాగా సహకరించారు. దీంతో చిత్తూరు జిల్లాలో దాదాపు రూ.46 కోట్ల కుంభకోణం జరిగిందని తెలుస్తోంది. తోతాపురి మామిడికి ధరల లేక ప్రభుత్వం అదనంగా రూ.4 ఇస్తామని చెప్పిన విషయం తెలిసిందే. దీన్ని ఎలాగైనా దక్కించుకోవాలని చాలామంది రైతులు భారీగా మోసాలకు పాల్పడ్డారు. ఫలితంగా జిల్లాలోని మామిడి రైతులకు ప్రభుత్వం నుంచి అందిన నష్టపరిహారంలో దాదాపు రూ.46 కోట్ల వరకు తప్పుడు బిల్లుల ద్వారా అక్రమాలు జరిగినట్లు సమాచారం.

మోసాలు ఎలాగంటే....

జిల్లాలోని రైతుల్లో సగం మంది మామిడి రైతులు మూడేళ్ల ఫలసాయానికి వ్యాపారులు తోటలను విక్రయించారు. కొనుగోలు చేసిన వ్యాపారి తోటలోని కాయలను తీసుకెళ్లాడు. కానీ రైతులు తామే ఫ్యాక్టరీలకు, లేదా సంబంధిత ర్యాంపులకు తోలినట్టు కాటా, హార్టికల్చర్ సిబ్బందితో కుమ్మక్కై దొంగ బిల్లులతో నష్టపరిహారం కోసం దరఖాస్తు పెట్టుకున్నారు. దీంతో వీరిందరికి ఇప్పుడు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందింది.

దొంగ బిల్లులకు భారీ కమీషన్లు...

ఎలాగైనా ప్రభుత్వం నుంచి అందే నష్టపరిహారాన్ని తస్కరించాలని భావించిన వారిలో 90శాతం కూటమి నాయకులే ఉన్నారు. అధికార బలాన్ని వాడిన వీరు ట్రాక్టర్ల ద్వారా ర్యాంపులకు మామిడిని అమ్మినట్టు దొంగ వేబ్రిడ్జి లెక్కలు, ట్రాక్టర్ల నంబరు ప్లేట్లను మార్చి వాటి ద్వారా సచివాలయ హార్టికల్చర్ సిబ్బంది ద్వారా ఈ అక్రమాలకు పాల్పడినట్టు తెలిసింది. ఈ అక్రమాలకు చేసిన వే బ్రిడ్జి నిర్వాహకులకు ట్రాక్టర్‌కు రూ.2 వేలు, హార్టికల్చర్ సిబ్బందికి రూ.1500, దొంగ ట్రాక్టర్‌కు రూ.500 చొప్పున ఇచ్చినట్టు తెలిసింది.

ఇదీ నష్టపరిహారం లెక్క...

జిల్లాలోని మొత్తం మండలాలు	34
మామిడి రైతులు	31,929
జరిగిన మొత్తం లావాదేవీలు	79,963
మొత్తం మామిడి కాయలు	3,67,116.528 మెట్రిక్ టన్నులు
రైతులకందిన నష్టపరిహారం	రూ.146 కోట్లు

దీనిపై విచారణ చేస్తే అసలు దొంగలు బయటకొస్తారు!

మామిడి రైతుల్లో 40 శాతం మంది దొంగ బిల్లుల ద్వారా ప్రభుత్వం నుంచి రూ.46 కోట్ల కుంభకోణానికి సంబంధించి హార్టికల్చర్ అధికారులు దీనిపై సమగ్రమైన విచారణ చేపడితే మరిన్ని మోసాలు బయటపడే అవకాశాలున్నాయి. అయితే ఈ అక్రమాల్లో హార్టికల్చర్ అధికారులే కీలకమైనందున ఎలా అక్రమాలు వెలుగు చూస్తాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. జరిగిన అక్రమాలపై జిల్లా కలెక్టర్ అయినా స్పందించి పూర్తిస్థాయిలో విచారణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సర్కారు వేధింపులు సరికాదు!

యాదమరి: పీహెచ్‌సీ వైద్యుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా కూటమి ప్రభుత్వం వేధింపులకు గురిచేయడం సరికాదని రాయలసీమ ప్రజారోగ్య, వైద్య ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి, మండల సీహెచ్ఓ శ్రీనివాస మూర్తి అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి, డాక్టర్ల సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ వైద్యులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజలకు చిత్తశుద్ధితో వైద్యసేవలు అందిస్తున్న వైద్యులపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం సరికాదన్నారు. పీజీ కోటాను 30 నుంచి 20 శాతానికి తగ్గించడంలో ఉన్న ఆంతర్యమేంటి?అని ప్రశ్నించారు. కేవలం ప్రైవేటు మెడికల్ కాలేజీల విద్యార్థులకు లబ్ధి చేకూర్చడానికే కోటాలో కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయంలో పీజీ కోటాను 30 శాతానికి తగ్గకుండా చూశారని తద్వారా పీహెచ్‌సీ వైద్యులకు బాసటగా నిలిచారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం తమ నిర్ణయాన్ని మార్చుకోవాలని లేకుంటే ఏజెన్సీ, రూరల్, అర్బన్ ప్రాంతాల్లోని పీహెచ్‌సీ వైద్యులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సీనియారిటీ ప్రకారం వైద్యులకు ఉద్యోగోన్నతి కల్పించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సిబ్బందితో పాటూ వైద్యుల నిరాహార దీక్షకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీపతి, సెల్వరాణి, స్టాఫ్ నర్సు ప్రభావతి, సహాయకులు సురేంద్రారెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం

– పూతలపట్టు సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్


పెరుమాళ్లపల్లెలో కోటి సంతకాల ప్రజా ఉద్యమ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సునీల్‌కుమార్, నేతలు

బంగారుపాళెం: కూటమి ప్రభుత్వం చేపడుతున్న ఏకపక్ష నిర్ణయాలతో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేసేందుకు పూనుకుందని, దానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రజా ఉద్యమాలు చేద్దామని వైఎస్సార్ సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని తుంబపాళెం, ఈచనేరిపల్లె, పెరుమాళ్లపల్లె పంచాయతీల్లో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ, గ్రామ కమిటీలు, అనుబంధ విభాగాల కమిటీల ఎంపిక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణ చేసి, పేద విద్యార్థులకు వైద్యవిద్యను దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వ దుష్ట చర్యలను నిరసిస్తూ సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమాలను పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఈనెల 10 నుంచి 22వ తేదీ వరకు గ్రామ, వార్డుల్లో రచ్చబండ, సంతకాల సేకరణ, 28న నియోజకవర్గ కేంద్రాల్లో ర్యాలీలు, నవంబర్ 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, నవంబర్ 23న నియోజకవర్గాల నుంచి జిల్లా కేంద్రాలకు సంతకాల పత్రాలు తరలింపు, 24న జిల్లా కేంద్రాల నుంచి పార్టీ కేంద్ర కార్యాలయానికి తరలింపు, గవర్నర్‌కు నివేదన, కోటి సంతకాల పత్రాల అందజేత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పార్టీ నేతలతో కలసి ×వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం× వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

కార్యకర్తలకు భరోసా కల్పించడమే లక్ష్యం

గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు భరోసా కల్పించడమే వైఎస్సార్‌సీపీ లక్ష్యమని డాక్టర్ సునీల్ కుమార్ అన్నారు. గ్రామస్థాయిలో కార్యకర్తలకు అధిక ప్రాధాన్యత కల్పించి పార్టీలో సముచిత స్థానం కల్పించేందుకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొత్తగా ఏర్పాటైన కమిటీ సభ్యులు గ్రామస్థాయిలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కష్టపడే కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దౌర్జన్యాలు, అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. కార్యకర్తలు ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 2029 ఎన్నికల్లో జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా గెలిపించుకునేందుకు పోరాటం సాగిద్దామన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యురాలు లలితకుమారి, పాలఏకరి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుమార్‌రాజా, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, సోషల్ మీడియా రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిషోర్ కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శులు గోవిందరాజులు, ప్రకాష్‌రెడ్డి, ట్రేడ్‌యూనియన్ జిల్లా కార్యదర్శి రఘుపతిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ కృపాసాగర్‌రెడ్డి, సోషల్ మీడియా నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డెప్ప, యూత్ మండల అధ్యక్షుడు గజేంద్ర, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు నాగరాజ, రైతు సంఘం మండల అధ్యక్షుడు అరుణామల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు శైలేష్, సర్పంచ్ అనురాధ, నేతలు రమేష్, హరి, దూర్వాసులు, బాలాజీ, సుధా పాల్గొన్నారు.

కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు

– మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి


మాట్లాడుతున్న నారాయణస్వామి

శ్రీరంగరాజపురం : రాష్ట్రంలో కల్తీ మద్యానికి బ్రాండ్ అంబాసిడర్ సీఎం చంద్రబాబునాయుడు అని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. పుత్తూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణస్వామి మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ మద్యపానం నిషేధం అమలు చేస్తే, ఆయన అల్లుడు చంద్రబాబునాయుడు ఊరురా బెల్ట్‌షాపులు పెట్టి మద్యాన్ని ఏరులై పారించారన్నారు. కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. గతంలో కల్తీ మద్యం విక్రయానికి అవకాశం లేకుండా జగనన్న ప్రభుత్వంలో ప్రభుత్వమే మద్యం షాపులు నిర్వహిస్తే, నేడు మద్యం షాపులో కల్తీ మద్యం ఏరులైపారుతుందన్నారు. కల్తీ మద్యం కేసు విచారణకు ఏర్పాటు చేసిన సిట్‌పై రాష్ట్ర ప్రజలకు నమ్మకం లేదన్నారు. ఎందుకంటే ఈ సిట్ కూటమి ప్రభుత్వం చెప్పినట్లు అధికారులు చేస్తారని, అందుకే సీబీఐతో కల్తీ మద్యంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి ఇసుక, గ్రానైట్, గ్రావెల్ అక్రమ రవాణా, గంజాయి విక్రయం తదితర అసాంఘిక కార్యకలాపాలతో రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతుందన్నారు. యువత గంజాయికి బానిసై తమ విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు అన్ని రంగాల్లో పెద్ద పీట వేస్తున్నాయని ప్రగల్భాలు పలికే టీడీపీ ప్రభుత్వంలో నేడు మహిళలపై దాడులు, అఘాయిత్యాలు,అత్యాచారాలు జరుగుతున్నా, కూటమి సర్కారు చూసి చూడనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ తన కుమార్తె, వైఎస్సార్ సీపీ గంగాధరనెల్లూరు నియోజవర్గం సమన్వయకర్తపై అసభ్యకరమైన రీతిలో సభ్యసమాజం తలదించుకునేలా వ్యంగంగా మాట్లాడటం టీడీపీకే చెందుతుందన్నారు. మహిళలు చీరలు కట్టుకోకూడదా? నగలు వేసుకోకుడదా? అని ప్రశ్నించారు. ఈ సృష్టికి మూలం స్త్రీ అని, ఆ స్త్రీమూర్తికి నేడు అవమానం జరిగితే సభ్య సమాజం తలదించుకోవాలన్నారు. ప్రపంచంలో అన్ని వర్గాల వారికి దేవుడు డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ అని, అలాంటి మహనీయుడిపై కూడా టీడీపీ రాజకీయం చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

తిరుమలలో తనిఖీలు


అనధికార వ్యక్తులు, యాచకులను బస్సులో తరలిస్తున్న పోలీసులు

తిరుమల : తిరుమలలో పోలీసులు, టీటీడీ విజిలెన్స్ అధికారులు మూడు రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. అందులో భాగంగా మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో 187 మంది యాచకులు, అనధికార హాకర్లను గుర్తించి తిరుపతికి తరలించారు. అలాగే 73 మంది అనుమానితుల వేలిముద్రలను సేకరించి రికార్డులను పరిశీలించారు. తిరుమలలో పనిచేసే కార్మికులను సంబంధిత యజమానులు పనులు పూర్తి కాగానే తిరుపతికి పంపివేయాలని సూచించారు అనధికార వ్యక్తులను గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు.

సెల్‌ఫోన్ లాక్కున్నారని ఆత్మహత్యాయత్నం

పాకాల : సెల్‌ఫోన్ లాక్కున్నారని మనస్తాపంతో ఓ బాలుడు (15) ఆత్మహత్యకు యత్నించిన ఘటన సోమవారం రాత్రి పాకాల భారతం మిట్టలో జరిగింది. ఇన్‌స్టాలో చాటింగ్ చేస్తుండగా కుటుంబసభ్యులు సెల్‌ఫోన్ లాక్కోవడంతో బాలుడు వెంటనే గదిలోకి వెళ్లి తలుపేసుకున్నాడు. దీంతో ఆందోళన చెందిన బాలుడి తల్లిదండ్రులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన చేరుకున్న పోలీసులు తలుపులు పగులగొట్టి బాలుడిని బయటకు తీసుకువచ్చారు. చేయి కోసుకుని అపస్మారకస్థితి చేరుకుని ఉండడంతో 108లో కొత్త కోట సీహెచ్‌సీకి తరలించారు.

కల్వర్టు కొట్టుకుపోయింది!


పుణ్యసముద్రం వద్ద కాణిపాకం వెళ్లే దారిలో కొట్టుకుపోయిన కల్వర్టు

తవణంపల్లె: మండలంలో ఇటీవల కాలంలో కురుస్తున్న భారీ వర్షాలకు బహునది పరివాహక ప్రాంతాలైన అరగొండ సమీపంలోని కల్వర్టు, మత్యం వద్ద వాగుపై ఉన్న కల్వర్టు కొట్టుకుపోయి రాకపోకలు స్తంభించిపోయాయి. సుమారు వారం రోజులుగా ప్రజల రాకపోకలకు, స్కూల్ బస్సులు, పాలవ్యాన్లు, ఆర్టీసీ బస్సుల రాకపోకలు స్తంభించాయి. మండలంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టకపోగా శాశ్వతంగా కల్వర్టులు నిర్మించి ప్రజల రాకపోకలకు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. వర్షాకాలం వస్తే ప్రజలకు రోడ్లతో వెతలు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే స్పందించి ప్రజల రాకపోకలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

లైసెన్సులు రద్దు చేయాలి


మాట్లాడుతున్న మామిడి రైతు సంఘ నేతలు

బంగారుపాళెం: జూస్ ఫ్యాక్టరీలు ఇస్తామన్న రూ.8 ఎక్కడని రైతు సంఘం నేతలు ప్రశ్నించారు. ఆ యజమానుల లైసెన్సులు రద్దు చేయాలని రైతు సంఘ అధ్యక్షుడు జనార్దన్, ప్రధాన కార్యదర్శి మునీశ్వర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేంద్ర డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం వారు మాట్లాడుతూ, మామిడి రైతుల ఆక్రందన సభ నేపథ్యంలో ఒక్క రోజు ముందు ప్రభుత్వం ఇస్తామన్న రూ.4 సబ్సిడీ రూ.185 కోట్లు విడుదల చేయడం సంతోషమన్నారు. అయితే ప్రభుత్వం ప్రకటన మేరకు రూ. 12 ఒకేసారి జమ చేసి ఉంటే బాగుండేదన్నారు. జిల్లా కలెక్టర్ గుజ్జు పరిశ్రమ యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి నేపథ్యంలో తొలుత రూ.8 చొప్పున వారి నుంచి రైతుల అకౌంట్లకు రూ.370 కోట్లు జమ చేసి ఉంటే పూర్తి భరోసా ఉండేదన్నారు. ఫ్యాక్టరీ యజమానులు నేటికీ ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేసేందుకు ముందుకు రాకపోవడం దారుణమన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఫ్యాక్టరీ లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం బంగారుపాళెం మార్కెట్ యార్డు వద్ద జరిగే రైతు ఆక్రందన సభ రూ.8 రాబట్టడడంపై దృష్టి సారిస్తామన్నారు. ఫ్యాక్టరీ, ర్యాంపు నిర్వాహకులపైన ప్రత్యేక్ష పోరాటానికి సన్నద్ధమవుతామన్నారు. రైతు ఆక్రందన సభకు ఆటంకం కలిగిస్తే రైతు వ్యతిరేకులుగా ముద్రపడటం ఖాయమన్నారు. భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తోందని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు మాట్లాడుతూ రైతు ఆక్రందన సభకు సీపీఎం మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మామిడి రైతు సంఘ నేతలు మునిరత్నంనాయుడు, శ్రీనివాస్, సంజీవరెడ్డి, మురళి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ ఆత్మహత్య

రొంపిచెర్ల: జేసీబీ డ్రైవర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రొంపిచెర్లలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనంతపురం జిల్లా కదిరి మండలానికి చెందిన చెవెళ్ల వీరేంద్ర(22) తల్లిదండ్రులు చనిపోయారు. తన సోదరి ఎర్రావారిపాళెం మండలం యల్లమందలో ఉన్నారు. తల్లిదండ్రులు లేక పోవడంతో సంవత్సరం క్రితం రొంపిచెర్లకు వచ్చి, గానుగచింత పంచాయతీ చల్లంపల్లెకు చెందిన బాబునాయుడు వద్ద జేసీబీ డ్రైవర్‌గా పని చేసేవాడు. బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని హైస్కూల్ వీధిలోని ఒక ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. నెల క్రితం తన స్వగ్రామం కదిరికి వెళ్లి కియా కార్ల ఫ్యాక్టరీలో పని చేసుకుంటానని చెప్పి వెళ్లిపోయాడు. అయితే మళ్లీ 10 రోజుల క్రితం రొంపిచెర్లకు చేరుకున్నారు. ఏమి జరిగిందో ఏమో తెలియదుగానీ ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందారు. ఇంట్లో నుంచి వాసన రావడంతో మంగళవారం రాత్రి పక్కన ఉన్న వారు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడు సుమారు నాలుగు, ఐదు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు గతంలో ఒక యువతిని ప్రేమించి మోసపోయి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. రొంపిచెర్ల పోలీసులు కేసు విచారణ జరుపుతున్నారు.

పరిశ్రమల స్థాపనకు చర్యలు


మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమల స్థాపనకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పరిశ్రమల శాఖ అధికారులు సహాయ సహకారాలు అందించాలన్నారు. జిల్లాలోని వ్యవసాయదారులకు సహాయ సహకారాలను అందించని మూడు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ పరిశ్రమలకు ప్రభుత్వ రాయితీలను నిలిపివేయాలని ఆదేశించారు. పరిశ్రమల కేటాయింపులకు అవసరమైన భూ కేటాయింపులు త్వరితిగతిన మంజూరు చేయాలన్నారు. చిత్తూరు–తచ్చూరు జాతీయ రహదారికి సమీపంలో ఉన్న పరిశ్రమలకు దారి ఏర్పాటు చేసేలా హైవే శాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. 2025–26వ సంవత్సరంలో జిల్లాలో ఇప్పటి వరకు 1,551 సూక్ష్మ, చిన్న పరిశ్రమలతో రూ.22 కోట్ల ఉత్పత్తి ప్రారంభించి 6,577 మందికి ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. త్వరలో 3,663 కోట్ల పెట్టుబడులతో 52 భారీ, చిన్న, సూక్ష్మ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పరిశ్రమల శాఖ జీఎం సూరిబాబు, జెడ్ఎం సుబ్బారావు, ఎల్‌డీఎం హరీష్, పరిశ్రమల సమాఖ్య ప్రతినిధి కట్టమంచి బాబి పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే తొలి టాటా నెర్వ్ కేంద్రం జిల్లాలో..

రాష్ట్రంలోనే తొలి టాటా నెర్వ్ కేంద్రం జిల్లాలోని కుప్పంలో ప్రారంభించడం జరిగిందని, త్వరలో జిల్లా మొత్తం అమలు చేసేలా చర్యలు చేపడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో సంజీవని హెల్త్‌కేర్ ప్రాజెక్ట్ అమలుకు ప్రామాణిక ఆపరేటింగ్ విధానం కుప్పం నియోజకవర్గంలో అమలు చేశామన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుధారాణి, డీపీఎంవో ప్రవీణ్, చిత్తూరు నియోజకవర్గం అధికారి డాక్టర్ అనూష పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధికి పటిష్ట చర్యలు

జిల్లాలో పర్యాటక అభివృద్ధికి పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధికి సంబంధిత శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. జిల్లాను పర్యాటకరంగంలో ముందంజలో ఉండేలా సంబంధిత శాఖల అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టాలన్నారు.

నగదు జమకాకపోతే ఆందోళన వద్దు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మామిడి రైతులకు సబ్సిడీ నగదు జమకాకపోతే ఆందోళన చెందవద్దని, అర్హులందరికీ సబ్సిడీ కచ్చితంగా చేరుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో మామిడి సబ్సిడీ నగదు జమ అంశంపై ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 31,929 మంది రైతుల ఖాతాల్లో రూ.146.84 కోట్లు సబ్సిడీ నగదు నుజమ చేశామన్నారు. ఎవరికైనా టెక్నికల్ సమస్య కారణంగా నగదు జమకాకపోతే ఆందోళన చెందాల్సిన అవ సరం లేదన్నారు. అగ్రికల్చర్ అధికారులను సంప్రదిస్తే సబ్సిడీ నగదు జమ చేసేందుకు చర్యలు చేపడతారన్నారు. జమ చేసిన సబ్సిడీ నగదులో బంగారుపాళెం మండలానికి చెందిన ఇద్దరు రైతులకు ఎక్కువ మొత్తం సబ్సిడీ జమ అయ్యిందన్నారు. జిల్లాలో 20 వేల మంది రైతులకు రూ.లక్షకు మించి సబ్సిడీ జమ అయినట్లు తెలిపారు. ఈ క్రాప్ బుకింగ్, క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం కచ్చితమైన సబ్సిడీ నిర్ధారించామన్నారు. అర్హత కలిగి నగదు జమ కాని రైతుల నుంచి అక్టోబర్ 30 వ తేదీ వరకు వినతులు స్వీకరించి సబ్సిడీ జమ చేసేందుకు చర్యలు చేపడతామన్నారు. రైతుల నుంచి వచ్చే అర్జీలను 48 గంటల్లోపు పునఃపరిశీలన చేసి నిర్ధారిస్తామన్నారు. రూ.5 లక్షలకు మించి సబ్సిడీ అందే రైతులు జిల్లాలో 21 మంది ఉన్నారని, వీరి అర్హతను మరింతగా పరిశీలించి నగదు జమ చేస్తామన్నారు.

ఆ మూడు ఫ్యాక్టరీలకు ఎలాంటి సహకారాలు ఉండవ్!

మామిడి రైతులకు సహకరించని మూడు ఫ్యాక్టరీలకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తరఫున ఇకపై ఎలాంటి సహాయ సహకారాలు ఉండవని కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని గుడిపాల, పుంగనూరు, బంగారుపాళెంలో ఉండే మూడు ఫ్యాక్టరీలు మామిడి రైతులకు సహాయ సహకారాలు అందించడంలో విఫలమయ్యాయన్నారు. ఆ మూడు ఫ్యాక్టరీలకు ప్రభు త్వం తరపున వచ్చే ప్రోత్సాహకాలను అందించడం జరగదని స్పష్టం చేశారు. జిల్లా హార్టికల్చర్ శాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.